# ఒక కుష్ఠు కథ

### బైరాగి

అనగనగా విదిశానగరాన్ని విక్రమ వర్మ అనే మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు, అతడు అందంలో చంద్రుడు, పరాక్రమంలో ఇంద్రుడు, విద్యలో బృహస్పతి. అతని పేరు చెప్తితే పరరాజులు గడగడ లాడే వారు. తన ప్రజలకు దుష్టముష్కర తస్కర భీతి లేకుండా చేసిన విక్రమ వర్మ గో బ్రాహ్మణ స్త్రీ వృద్ధులను కంటి రెప్పలా కాచేవాడు. అతని రాజ్య సభా వైభవాన్ని గూర్చి ఖండఖండాంతరాల ప్రజలు వింతగా చెప్పుకొనేవారు.

రమణీ హృదయ రమణు డనీ రసికజనాభిరాము డనీ పేరెన్నిక గన్న విక్రమవర్మ పరీక్షించని రత్నంలేదు, ఆఘ్రాణించని కుసుమం లేదు. ఆస్వాదించని రుచి లేదు, ఆనందించని అందం లేదు, అనుభవించని భోగం లేదు. వివిధ దేశాల, జాతుల, మతాల, వర్ణాల, అనుపమ సుందరాంగులకు అతని రాజధాని ఆకరంగా ఉండేది. కుంకుమపూవును వోలిన కాశ్మీర కాంతల కమ్రత, గాంధార గజగామి నుల గాంభీర్యమూ, గుర్జరాంగనల గాఢోపగూహన గాఢ సౌఖ్యమూ, కామరూప కామినుల కామతీవ్రతా, కేరళ చారుగాత్రల ప్రౌఢశృంగారమూ, ఆంధ్రాంగనల అంగపాటవమూ, హూణ యవన శకాదిక వివిధ విదేశ సాహసినుల విశిష్ట సంపర్క సౌఖ్యాలూ రసికాగ్రేసరుడైన ఆ రాజుకు కరతలామలకాలు. ప్రావీణ్యం గల రౌతు పొగరు గల గుర్రాలను లొంగదీసినట్లు ఆ విక్రమవర్మ ఎంతటి మదవతులనైన ఇట్టే లొంగదీసుకో గలిగిఉండేవాడు. రాజ్యంలో పాపభీతి లేక స్వేచ్ఛా వర్తనలైన రూపవతుల హతాశులైన సంరక్షకులకూ, పెద్దలకూ మహారాజు ఆపద్బాంధవు డైనాడు. పెడత్రోవ త్రొక్కిన గడుసరి చేడియలకు అంతఃపురము ఆలవాలమైనది. భోగసాగ

రంలో మునిగితేలే మహారాజుకు తెప్ప కూడా అవసరం లేకపోయింది.


కాని అంతటి మహారాజుకు కూడా ఒక మనఃక్లేశము తప్పలేదు. చిత్రమేమనగా మహారసికుడైన మహారాజు సంతాన సుఖానికి నోచుకోలేదు. ఎన్నో తీర్థాలు సేవించాడు. యజ్ఞయాగాలూ, పూజాపునస్కారాలూ చేశాడు. ముక్కోటి దేవతలకూ మ్రొక్కుకున్నాడు. కాని ఫలితం శూన్యం. పూవును తొలచే పురుగు లాగా ఈ దిగులు మహారాజు మనసును కలచసాగింది. నిగమాగమకోవిదులైన పండితులూ, మంత్రులూ, మహామంత్రులూ పరిపరివిధాల యోచించారు కాని తగు మార్గము తోచలేదు.

అట్టి తరుణాన విదిశానగరానికి తరుణ వయస్కుడైన ఒక యోగి పుంగవుడు అరుదెంచాడు. పూర్ణచంద్రునివంటి అతనివదనంలో వర్చస్సు చూసి నాస్తికులకు సైతం భక్తిభావం కలిగింది. పురుషులు వినమ్రులైనారు. రమణులు పరవశలైనారు. నగరంలో ఏయింటచూచినా ఆ యోగి ప్రశంసలే. ఇహసుఖాలు పులిసిన పండ్లైన పురుషులూ పురుష సంగమంకొరకు మొగం వాచిన రమణులూ, ధనార్జనలో దైవ సహాయం కోరే వ్యాపారులూ, సంకేత స్థలాల కొరకు వెదకే విటీవిటులు మొదలయినవారికి ఆ యోగి ఆస్పద మైనాడు, ఆశ్రయ మైనాడు.

యోగి దర్శనార్థము తరుణులు తండోపతండాలుగా బయలుదేరారు. వారి వెనుక వారి పురుషులు బయలుదేరారు. ఇంట నున్న పిల్లల సంగతి కనుక్కునేవారే లేకపోయారు.

ఆ యోగి పుంగవుని అద్భుత తేజస్సు చూచి ఆకర్షింపబడినవారిలో మహారాజు కిష్టురాలైన మూడవరాణి పూర్ణిమాదేవి ముఖ్యురాలు. ఆమె ప్రోద్బలంవల్ల మహారాజు యోగిని అంతఃపురానికి రప్పించాడు. చాతుర్మాసంగడపటానికేర్పాట్లుగావించాడు. సంతాన ప్రాప్తికొరకు పూర్ణిమాదేవికి యోగిపుంగవుడు నిర్దేశించిన అతి రహస్యమైన అనుష్ఠానాలకు వలసిన ఏకాంతమూ, సదుపాయమూ కల్పించాడు. అసూయాగ్రస్తలైన తదితర రాణులూ, వారి ఆశ్రిత పరివారమూ ఏమి గుసగుసలాడినా లెక్కచేయలేదు. మహారాజు అచంచల విశ్వాస ప్రభావం చేత ఈశ్వరునికి అనుగ్రహం కలిగింది. యోగిపుంగవుని కృషి ఫలించి పూర్ణిమాదేవి గర్భం దాల్చింది.

ఈ శుభవార్త విన్న మహారాజు ఆనందానికి మేరలేకపోయింది. దేశమంతటా ఉత్సవాలూ, వేడుకలూ జరిపించమని ఉత్తరవు చేశాడు. ఆ ఖర్చుల కొరకు ప్రజలపైన ఒక క్రొత్త




పన్ను వేశాడు. దీనినే కిట్టనివారు 'మూడవరాణి గర్భపు పన్ను' అనీ, 'యోగిపుంగవుని చాతుర్మాసపుపన్ను' అనీ అన్నారు.

మూడవరాణి ఇప్పుడు మహారాజుకు ప్రాణ మైనది. పట్టపురాణి కన్ననూ మిన్నయైనది. మహారాజు ఆమె చేతి కీలుబొమ్మ యైనాడు.

నవమాసములు నిండగనే మూడవ రాణి పండువంటి మగబిడ్డను కన్నది. పూర్ణచంద్రునివంటి ఆ బాలుని నెమ్మోము గాంచిన తోడనే మహారాజు హృదయసాగరము పొంగులు వారినది. రాజకోష్టము రిత్తబోవునట్లు దానధర్మములు ఆచరించాడు. కోరిన వారికి కోరినట్లు ఇచ్చాడు. దేశమంతటా ఇదివర కెన్నడూ కనీ వినీ ఎరుగనట్లు వేడుకలూ, ఉత్సవాలూ జరుపమని సెలవిచ్చాడు. దీనికొరకు మరొక క్రొత్తపన్ను విధించినా తమ భావిపాలకుడు జన్మించిన మహదానందంలో అమాయక ప్రజలు పన్నుల బాధను సులభంగానే భరించారు.

దినదిన ప్రవర్ధమానుడైన ఆ బాలుడు క్రొన్నెల బాలునివోలె నిత్య నూతన కళావిలసితుడై కాలక్రమాన షోడశకళా ప్రపూర్ణుడైనాడు. జననీ జనకుల, ప్రజల, పరిజనుల హృదయ సాగరములకు పూర్ణచంద్రుడైనాడు. అన్ని విద్యలు అరసినవాడై, అస్త్ర శస్త్ర ప్రయోగము గరసినవాడై, రాజ్య యుద్ధ విత్త తంత్రములందు ఆరితేరినవాడైనాడు.

నవవయఃపరిపాక వికసితమైన ఆ రాకుమారుని సుందరాకృతి చూచి రాణువంలోని జాణలు గుటకలు మ్రింగసాగినారు. రాజకు॥ కన్యకామణులు నిట్టూర్పు విడువసాగినారు.

రాజధానిలో విశేష విఖ్యాతి చెందిన వారవధూటులు కుతూహలాయత్త చిత్తలైనారు. కాని చిత్ర మేమనగా ఆ రాకుమారుని చిత్తము శృంగార రసభృంగములుకు లొంగని చంపక మైనది. చపలచిత్తలగు మత్తకాశిను లకు అందని మ్రానిపండైనది. స్పర్శ రూప రస శబ్ద గంధాదుల సందుల విఫణి వీధిలో నిస్సంగయోగివలె తిరుగాడు ఆ తరుణును చూచి మహారాజు సైతం అచ్చెరు వొందినాడు. 'ఆ మహారాజు పుత్రుడేనా ఇతడు?' అని మంత్రులూ, పరిజనులూ, పురజనులూ మ్రుక్కున వ్రేలిడుకొనినారు.

వయసుకు విరుద్ధమైన రాకుమారుని నిర్లిప్తత మహారాజునకు చింతాకారణ మైనది. పరిపరివిధముల యోచించి నాడు. మంత్రులను సంప్రతించినాడు. లేకలేక కలిగిన ఒక్క కుమారుడూ సిద్ధార్థునివలే రాజ్యం విడచి అడవులు పట్టిపోతాడేమోనని దిగులుపడినాడు. రాకుమారునితో చనువుగా ఉండే వయస్యుల తంత్రుల ద్వారా, వారిని చేరదీసినవాడై, తన కుమారుని మనోగతము తెలుసుకోవా లని ప్రయత్నించాడు. రాకుమారునితో శారీరికంగా ఏమన్నా లోపా లున్నాయా అని అనుమానపడి ఆరా తీసి, అలాంటి వేమీ లేవని తెలుసుకొని తృప్తి చెందాడు. అంతఃపురంలోని చక్కని చుక్కలనూ, ఆశ్రితుల, పరి జనుల పరివారంలోని సుందర యువతు లనూ రాకుమారునిమీదకు పురికొల్పిం చాడు. అందుబాటులో ఉన్న అంద గత్తెలను రాకుమారుణ్ణి ఆకర్షించ టానికి వినియోగించాడు. యుద్ధానికి పన్నినట్లుగా వ్యూహం పన్ని ఎత్తు గడులు వేశాడు. కాని ఆ ప్రయత్నా లన్నీ విఫలమైనాయి. మహారాజు పాచిక లేమీ పారలేదు.

తరువాత ఏకాంతంలో మహా రాజూ, మంత్రులూ ఆ అందగత్తెలను రాకుమారునిగూర్చి ప్రశ్నించారు. వారంతా ఏకగ్రీవంగా 'వారిని చూస్తే మాకు భయం' అన్నారు.

"ఏం ఎందువల్ల?" అని అడిగాడు మహారాజుగారు.

"ఆయన అదోలా చూస్తారు."

"మగవాళ్లంతా అలా చూడరా?"

"ఆయన అందరిలా చూడరు, ఏమీ పట్టనట్లు అదోలా చూస్తాడు. ఆ ఒక్క చూపుతో మా హృదయాల్లో రహస్యా లన్నీ ఆయనకు తెలిసిపోయాయా అని పిస్తుంది. సిగ్గూ, భయమూ వేస్తాయి. మమ్మల్ని చూస్తే మాకే అసహ్యం వేస్తుంది.

"పడిశారు, పొండి." వాళ్ళంతా వెళ్ళిపోయారు.

"చూశారుగా? యువరాజులుగారి వ్యవహారం; మన కేమీ అంతుపట్టేట్లు లేదు," అన్నాడు మహారాజు.

'చిత్తం, చిత్తం.' అన్నారు మంత్రులు.

"ఆ అమ్మాయిలు చెప్పింది నిజమే," అన్నాడొక ముసలిమంత్రి.

"ఎందువల్ల?"

"సాధారణంగా మగవాని చూపుల్లో ప్రేమో, కోరికో, క్రౌర్యమో, ఏదో ఒక వికారం కలిసి ఉంటుంది. ఆ వికారాలే చూచే వస్తువుకు తోడుగులూ అలంకరణలూ కల్పిస్తాయి. లేని ఆకర్షణ కలిగిస్తాయి. ఉన్న లోపాలను కప్పిపుచ్చుతాయి. నిర్వికారమైన చూపు చూడబడేదానిని యథాతథంగా చూస్తుంది. యథాతథంగా చూస్తే ఏ వస్తువూ, అందులో ముఖ్యంగా మానవ దేహం అసలే బాగోదు," అన్నాడు ముసలిమంత్రి.

'ఆపవయ్యా నోది," అన్నాడు మహారాజు.

'చిత్తం,' అని నోరు మూసుకున్నాడు ముసలిమంత్రి.

అప్రాకృతికమైన, అసహజమైన మార్గంలో వెళ్ళుతున్న తన కుమారుని బుద్ధి మరల్చుట మెలాగా అనే యోచనలో పడ్డాడు మహారాజు. పోనీ, ఏదన్నా కారణం వల్ల అతనికి స్త్రీలంటేనే ద్వేషం కలిగిందా అంటే అదీ కనుపించదు. ఈడూజోడైన ఆడపిల్లలతో కులాసాగా నవ్వుతూనే మాట్లాడుతాడట. కాని అంతే, అంతవరకే. అతనివద్దనుంచి అంతకుమించిన చనువు ఏ యువతికీ లభించినట్లు కనుపించదు. దీనిలో ఉన్న కిటుకు ఏమిటి? తన కుమారుడు అపరశూరుడెలా అయినాడు?

ఆలోచించినకొలదీ మహారాజుకొక విధమైన కసి కలుగసాగింది. మానవ హృదయపు లోతులు తరచి చూసిన తనవంటివాడు ఈ విధంగా తలమునకలై పోవటం చాలా అవమానకరంగా తోచసాగింది. ఒక విధమైన పట్టుదల పెరిగింది.

రాకుమారుని ఈడూజోడైన వాళ్ళలోనే కొంతమంది గూఢచారుల్ని నియమించాడు మహారాజు. రాకుమారుడు ఎప్పుడు ఎక్కడకు వెళ్ళుతున్నదీ, ఏమి చేస్తున్నదీ, క్షణక్షణం వార్తలు చేరసాగాయి. తండ్రి కొడుకును వేయి కండ్లతో వెంటాడసాగాడు.

అకస్మాత్తుగా లోకంలోని అందగత్తెలంతా తనవెంట బడుతున్నట్లు అనిపించింది రాకుమారునికి. ముక్కూ మొగం ఎరుగనివాళ్ళు ప్రేమలేఖలు వ్రాయసాగారు. మూడు మూలలను ఎటు చూచినా అజ్ఞాత ప్రేయసులు తారసిల్లసాగారు. అతని జీవితంలో

గుట్టూ మట్టూ అనేది లేకుండా పోయింది అవాంఛితంగా విరుచుకు పడుతున్న ఈ ప్రణయ సన్నివేశాలను తప్పుకొనేటప్పటికి అతని తల ప్రాణం తోకకు వస్తున్నది.

ఈవిధంగా తటస్థ పడినవారిలో కొంతమంది అప్సరసలవంటి రూప వతులు లేకపోలేదు. అలాంటివారిని చూచినప్పుడు యువరాజు మనస్సు కొంచెం రెపరెపలాడకపోలేదు. అయినా ఎంతటి అప్సరసైనా వచ్చి మీద పడుతూఉంటే ఎవరికైనా చులకనే గదా? వరూధినిని చూచి ప్రవరునికి అందువల్లనే కదా చులకన కలిగింది జీవితంలో క్రిందా మీదా పడి ఒంటినిండా దుమ్ము చేసుకున్న తరువాత పరవాలేదు; కాని ఇంకా శరీరమూ, మనస్సూ శుభ్రంగా ఉన్నవారి సంగతేమిటి? మహారాజు పన్నిన పన్నుగడలు, ఆయన ఉద్దేశించని ఫలితాలు కలిగించసాగినాయి.

ఒక రాత్రి భోజనానంతరము ఒక యువతి తాంబూలం తీసుకొని యువరాజు కక్ష్యలోకి వచ్చింది తాంబూలమిచ్చి తటపటాయిస్తూ నిలుచుంది

"నీ వెవరవు? నిన్ను ఇదివరకెన్నడూ చూడలేదే!" అన్నాడు యువరాజు

"నా పేరు మంజుభాషిణి." అన్నది ఆ యువతి బెదురుగా

"క్రొత్తగా వచ్చావా?"

"అవును."

"మంజుభాషిణి! మంచి పేరే!" అన్నాడు రాకుమారుడు ఆ యువతి వంక చూస్తూ. ఆ యువతి వేటగాడు ఎదురుపడిన లేడిపిల్లలా బెదురుతున్నది. పరరాజుల సీమలో చిక్కిపోయిన గూఢచారిలా వడకిపోతున్నది.


"భయపడకు, నేను పెద్దపులిని కాను. నిన్ను మ్రింగనులే."

"ఆ అమ్మాయి ఇంకా భయపడిపోతున్నట్లు కనుపించింది." "సరే వెళ్ళు!" అన్నాడు యువరాజు.

ఆ యువతి ప్రాణాలు దక్కినవి చాలన్నట్లుగా పారిపోయింది

"ఎవరీ అమ్మాయి! పూర్వం ఎక్కడో చూసినట్లుగా ఉందే?" అనుకున్నాడు. ఒక్క కునుకు తీసి మళ్ళీ మెలుకువ వచ్చిన తరువాత అకస్మాత్తుగా గురుతు కొచ్చింది యువరాజుకు. ఆ యువతిని కొలదిరోజుల క్రితం మహారాజు ఏకాంత కక్ష్యలో చూచినట్లు. సమస్య తీరిందన్నట్లు తృప్తిగా నిద్ర బోయాడు.

రెండు మూడు రోజుల తరువాత మహారాజావారు పిలిపించారు యువరాజును "పెండ్లి చేసుకుంటారా? ఇరుగుపొరుగు రాజులనుంచి సంబంధాలు వస్తున్నయ్," అన్నారు మహారాజు హఠాత్తుగా



''గోడౌన్‌లో బియ్యం మాయం కావటానికి కారణం ఇవండీ ;"

"ఇప్పుడే తొందరేం వొచ్చింది ?"

"తొందరేమీ లేదు. మీకిష్టమైతేనే"

"కొంతకాలమాగుదాం."

'సరే'అన్నారు మహారాజుగారు.

తల్లి పూర్ణిమాదేవికి యువరాజు నడవడి ఇంకా విచిత్రంగా తోచేది ఆమెకు తన కొడుకును చూచి అయోమయంగా ఉండేది. సాధారణంగా దేహాలు ఉడిగిపోతాయి. కాని మనసు ఉడిగిపోదు ఆ అందమైన తరుణ తనువులో అంత ముసలి మనసును చూసి పూర్ణిమాదేవి భయపడేది. ఈ సుపుత్రుని పుట్టువు తనకు పట్టమహిషికి లేని గౌరవాన్ని కలిగించింది. మహారాజును తన దాసుణ్ణి చేసింది. అంతే. ఇతడు తన కొడుకేకాని పరాయివాడు. తను కన్నదేకాని అతనిది తన రక్తం కాదు. తన రక్తం అంత చల్లనిది కాదే! నడివయస్సు దాటినా తన రక్తంలో మంట లింకా ఆరలేదే ? ఆ యోగి అవును, ఈ రాకుమారుడు అతని ప్రతిరూపమే.

చైత్రమాసం వచ్చింది. వసంతోత్సవం దగ్గరకు వచ్చింది. పౌరుల ఆనంద కోలాహలం మిన్నుముట్టింది. ఇంటింటా విందులూ, వేడుకలూ, నృత్యాలూ, గానాలూ. వసంతోత్సవంనాడు నగర వారవనితల్లో ప్రముఖురాలైన మధురవాణి ఏకైక పుత్రిక నీలవేణి ప్రథమ నాట్య ప్రదర్శనం ! ఈ మధురవాణి ఒకప్పుడు

మహారాజుగారికి చాలా కృపాపాత్రు రాలు. అసమాన రూపవతి; చతుర. అన్ని విద్యలలో ఆరితేరినది. కూతురు తల్లినికూడా మించిపోయిం దని వినికిడి.

నీలవేణి నృత్యప్రదర్శనానికి మహారాజు, యువరాజు, మంత్రులు, తదితర ప్రముఖులంతా విచ్చేశారు. ప్రదర్శనం చాలా రక్తి గట్టింది. నీలవేణి పాల పొంగువంటి పసిడిప్రాయంలో ఉన్న కన్య. చక్కని ముఖం; చెక్కినట్లున్న అంగసౌష్టవం. ఆ అమ్మాయి నృత్యం చేస్తుంటే, సెలయేరులు పారుతున్న ట్లుంది. కురంగ శాబకాలు చెంగలించి నట్లుంది. వనమయూరాలు నాట్య మాడినట్లుంది. నృత్యశాలలో ఆ కల్లా డని నిశ్శబ్దం. అంతా తదేకదీక్షగా చూస్తున్నారు. ముఖ్యంగా యువ రాజు తన్మయుడై పోయాడు. మహారాజావారు ఇది గమనించ లేక పోలేదు.

ప్రదర్శనం ముగిసిన తరువాత నీల వేణిని మహారాజావారికి, యువరాజుకు పరిచయం చేశారు. మహారాజు దీవించాడు. ఆమె కౌశలాన్ని మెచ్చుకు న్నాడు. తరువాత నీలవేణి తలవంచి మహారాజుకు నమస్కారం చేసింది. యువరాజు మోహనవిగ్రహాన్ని ఒక్క సారి సంభ్రమంతో తల ఎత్తి చూసి మందహాసం చేస్తూ నమస్కరించింది.

నాటినుంచీ యువరాజు అప్పుడ ప్పుడు మధురవాణి ఇంటికి వెళ్ళివస్తూ ఉండేవాడు. ఈ విషయం వెంటనే మహారాజుగారికి తెలిసింది. ఆయన తనలో తాను నవ్వుకొన్నాడు. పిట్ట ఎగిరి ఎగిరి గూటికి చేరుకుంటున్న దను కున్నాడు. మానవ ప్రకృతి ఎప్పుడూ జయిస్తుంది. తదనుగుణంగా పథకం వేసుకొన్నవాళ్ళకు ఎన్నడూ అపజయం వాటిల్లదు.

మధురరాణి యువరాజును సాధా రణంగా ఆహ్వానించింది. తన కుమా ర్తెకు యువరాజు ప్రాపకం లభిస్తే ఇంకేం కావాలి? పైగా అందగాడు. ప్రాయంలో ఉన్నాడు. తాను మహా రాజుగారికి కృపాపాత్రురాలుగా ఉన్న రోజులు మళ్ళీ జ్ఞాపకం వచ్చాయి.

మధురవాణి సౌధం వెనక చక్కని ఉద్యానవనం ఉండేది. రాకుమారుడూ నీలవేణీ రోజూ అక్కడ కలుసుకునే వారు. ప్రాయంలో ఉన్న యువతీ యువకులు సాధారణంగా మాట్లాడు కునే విషయాలే ముచ్చటించుకునే వారు. నృత్యాన్ని గురించీ, సంగీతాన్ని గురించీ, రాజధానిలో అప్పట్లో జనులకు చర్చనీయాలుగా ఉన్న విష యాలను గురించీ మాట్లాడుకునేవారు. ప్రేమను గురించి పరస్పరంగా తమ కున్న ఆకర్షణను గురించి మాట్లాడు కునేవారు కాదు. రాకుమారుడు వెళ్ళి

పోగానే మధురవాణి ఆతృతగా కుమా ర్తెను పిలిచి, 'రాకుమారుడు ఏం చెప్పాడు' అని అడిగేది.

"ఏమీ చెప్పలేదు."

"మీరు ఇంతసేపూ ఏమి మాట్లాడారు?"

నీలవేణి తాము మాట్లాడిన విషయాలను గురించి చెప్పేది. మధుర వాణికి నమ్మకం కలిగేది కాదు. "అది కాదే వెర్రిదానా! మీ సొంతవిషయాలు ఏమీ మాట్లాడలా?"

"మా సొంత విషయాలు ఏమున్నాయి మాట్లాడటానికి?"

మధురవాణి నిర్ఘాంతపోయి చూసేది.

ఇలా చాలారోజులు గడచాయి. నీలవేణీ రాకుమారుల స్నేహం మొదట్లో ఎక్కడ ఉందో అక్కడే ఉంది. మధురవాణి దృష్టిలో అది ఏమీ ముందుకు సాగలేదు. రాకుమారుడు మాత్రం రోజూ వస్తూ ఉన్నాడు.

రాకుమారుని వైఖరి నీలవేణికి కూడా చిత్రంగానే తోచేది. ఇతడు అందరిలాంటివాడు కాడు అనుకునేది. ఆ పిల్ల మరీ అమాయకురాలేమీ కాదు. తన చుట్టూ ఉన్న వాతావరణంవల్లా ఆ తల్లి బిడ్డ కావటం వల్లా ఆ వయస్సులో ఉండే ఆడపిల్లలకుండే ప్రపంచ జ్ఞానంకన్నా నీలవేణికి కొంచెం ఎక్కువగానే ఉండేది. ఆ పిల్ల అందం చూసి నగరంలోని సామంత కుమారులూ, మంత్రి కుమారులూ, అభిజాత కుటుంబాల యువకులూ, ధనవంతుల ముద్దుల కొడుకులూ చాలామంది ఆకర్షింపబడ్డారు. ఎన్నో ఆశలు చూపారు. తల్లికి వర్తమానాలు పంపారు. కాని మధురవాణి తెలివిగలది. ఉట్టికెక్కటమే ఆశయంగా పెట్టుకున్న వాళ్ళు స్వర్గాని కెప్పుడూ దూరంగానే ఉంటారని ఆమెకు తెలుసు. అందువల్ల తన తోటచుట్టు ఎత్తైన ప్రహారీగోడ కట్టి ఎవరూ అనధికారంగా ప్రవేశించకుండా కట్టుదిట్టాలు చేసింది.

అయితే ఈ రాకుమారుని నైజం అర్థం కాకపోవటం వల్ల లోకానుభవం గల మధురవాణికూడా తికమక పడింది. కూతురు తనదగ్గర ఏ విషయాలూ దాచదు. కట్టుబాట్లతో పెరిగిన పిల్ల. నీలవేణికోసం కాకపోతే ఈ రాకుమారు డసలు తన ఇంటికి ఎందుకు వస్తున్నట్లు? అబ్బో, మగవాళ్ళ సంగతి తనకు తెలియదా? ఇతడు మాత్రం మగవాడు కాడా? మరి మగవాళ్ళలో సహజంగా ఉండే తొందర ఇతనిలో కనుపించదేం? ఎంత సేపటికి అసలు విషయం బయట పెట్టడేం! చల్ల కొచ్చి ముంత దాస్తాడేం?

పరిస్థితులు ఈ విధంగా ఉండగా మహారాజావారు జోక్యం కలిగించు కొన్నారు. ఒక రోజున రాకుమారుడు

రాని తరుణంలో ముఖ్యమంత్రి వచ్చి మధురవాణిని కలుసుకున్నాడు. "వ్యవహారం ఏ దశలో ఉం"దని అడిగాడు. మధురవాణి మంత్రిని దెప్పి పొడిచింది. "త్రోవ తప్పి" వచ్చారే అన్నది. ఉన్నవిషయాలు చెప్పింది. మంత్రి పెదవి విరచి, "అంత సంతృప్తికరంగా లేదన్నమాట" అన్నాడు.

"మహారాజావారుఎప్పుడువస్తారు? ఏం, వారు మా యింటికి రాగూడదా?" అన్నది మధురవాణి.

"కొంచెం ఓపికపట్టు. తరుణమైతే వారే వస్తారు." అన్నాడు ముఖ్యమంత్రి.

"జాగరూకతగా ఉండమనీ, విషయాలు ఎప్పటికప్పుడు తెలియచేస్తూ ఉండమనీ" హెచ్చరించి ముఖ్యమంత్రి వెళ్ళిపోయాడు.

మధురవాణి తన కూతురును పిలిచి మహారాజు అభిమతానికి అనుగుణంగా హితబోధలు చేసింది.

నాటినుంచీ నీలవేణి ప్రవర్తనలో ఏదో సూక్ష్మమైన మార్పు వచ్చినట్లు రాకుమారుడు గమనించాడు—నీలవేణి తనను ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నదా అనే సందేహం కలుగసాగింది. అయితేగాని ప్రయోజనం ఏమిటి? తాను నీలవేణివల్ల ఇదివరకే ఆకర్షింపబడినాడే! తనను దేనికో త్వరపెట్టాలని నీలవేణి కోరుతున్నదని యువరాజు ఊహించాడు. క్రమంగా అతని దృక్పథంలోకూడా మార్పు రాసాగింది.

ఇంతవరకూ రాకుమారుడు నీలవేణిని తాకనుకూడా తాకలేదు. 'ఒకరోజున నీలవేణి తనను వేధించి ఇతర యువకులను గురించి ప్రస్తావిస్తూ ఉండగా యువరాజు ఆమెను దగ్గరకు తీసుకొని, తలను రెండు అరచేతులతో పొదివి పట్టుకొని సూటిగా కండ్లలోకి చూస్తూ 'నేనంటే నీకిష్టమేనా' అని అడిగాడు. నీలవేణి మాట్లాడకుండా 'ఔ' నన్నట్లు తల ఊపింది.

ఈ వార్త క్రమంగా మధురవాణి వద్దకు, అక్కడినుంచి మహారాజువద్దకు చేరింది.

నాటినుంచీ యువరాజూ, నీలవేణీ మధ్య ఒక విధమైన సంకోచం పెరిగిపోయింది. పూర్వంలా ఏకాంతంగా కూర్చొని స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగేవాడుకాదు. తరువాత కొద్దిరోజులదాకా యువరాజు నీలవేణి ఇంటికి రాలేదు.

ఒకరోజు సాయంకాలం యువరాజు హఠాత్తుగా మధురవాణీ ఇంటికి వచ్చాడు. నీలవేణి ఉద్యానంలో ఉందని తెలుసుకొని సరాసరి ఆమెవద్దకు వెళ్లాడు. నీలవేణి యువరాజు రావటం చూసి లేచి నిలుచున్నది. యువరాజు ఆమె చేయి పట్టుకొని ఏ విధమైన ఉపో



"మీరు చూసిన చీరె లన్నిటిలోకీ ఈ చీరె మీకు బాగా అతుకుతుంది."

ద్ఘాతం లేకుండా, 'నన్ను పెళ్ళి చేసుకొంటావా?' అని అడిగాడు.

నీలవేణి దిగ్భ్రమచెంది 'అదెలా కుదురుతుంది?' అన్నది.

'ఏమి,' అన్నాడు యువరాజు?

'మహారాజువారు ఒప్పుకోరు.'

'ఒప్పుకుంటేనో?'

'మా అమ్మ నడగాలి.'

'అడిగి చూడు. నేను ఎల్లుండి వస్తాను,' అని యువరాజు వెళ్ళిపోయాడు.

నీలవేణి వెళ్ళి ఆతృతగా ఎదురు చూస్తున్న తల్లికి ఈ విషయం చెప్పింది.

'అమ్మో, ఇంకేమన్నా ఉన్నదా!' అన్నది మధురవాణి. 'నీ కెందుకూ? నువ్వూరుకో. నేను చూస్తాలే ఈ విషయం' అన్నది.

ఆశ ఎంత తెలివిగలవాళ్ళనైనా పీడిస్తుంది. ఆ రాత్రి మధురవాణికి నిద్రపట్టలేదు. తన గతమంతా గుర్తుకొచ్చింది. నిజంగా ఇలా జరిగితే! ఎంతో చక్కని ఈడుజోడూ? కాని జరగదు. ఎందుకొచ్చిన పగటికలలు! మహారాజావారు ఎన్నటికీ ఒప్పుకోరు. ఆయన సంగతి తనకు తెలియదా? మళ్ళీ ఆశ! ఏమో, అదృష్టం ఎలా ఉందో! తన రాత సరిగ్గా ఉంటే మహారాజావారి మనస్సు మారకూడదా? తూర్యనాదాల మంగళధ్వానాల కలలతో తెల్లవారుజామున కునుకుపట్టింది మధురవాణికి.

మరుసటిరోజు మహారాజును కలుసుకొని, యువరాజు తన నిశ్చయం వెళ్ళడించాడు 'దానితో పెళ్ళేమిటి, ఛీ ! ఛీ ! నీ కేమన్నా మతి పోయిందా? ఎవరన్నా వింటే నవ్విపోతారుకూడా!' అన్నాడు మహారాజు

'నేను పెళ్ళిచేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను,' అన్నాడు యువరాజు.

మహారాజు రాజధర్మమూ, ప్రజల పట్ల రాజు కర్తవ్యమూ బోధిస్తూ ఒక చిన్న ఉపన్యాస మిచ్చి, ఈ పెళ్ళి ఎందువల్ల జరగటానికి వీల్లేదో సహేతుకంగా నిరూపించాడు కావలిస్తే నీలవేణిని ఉంచుకో మనీ, రాజుల కిది తప్పు కాదనీ అన్నాడు. పెళ్ళి మాత్రం రాజ్యక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాజవంశపు కన్యతో జరుగవలసిందే నన్నాడు యువరాజు తలవంచుకొని వెళ్ళిపోయాడు

ఆ సాయంత్రం మహారాజావారు మధురవాణి ఇంటికి వెళ్ళాడు నీలవేణితోకూడా మాట్లాడారు. రాజ్యక్షేమ దృష్ట్యా వారి కర్తవ్యాన్ని వివరించి, యువరాజుకు ఏమి సమాధానమివ్వాలో నిర్దేశించారు.

మరుసటిరోజు ఖిన్నవదనంతో వచ్చిన యువరాజును మధురవాణి యింట్లో ఎవ్వరూ నవ్వుమొగంతో అభ్యర్థించలేదు, ఆదరించలేదు తనకు ఏమి సమాధానం రాబోతున్నదో యువరాజు గ్రహించాడు. అయినా నీలవేణి నోటితో వినా లనే పట్టుదల కొద్దీ అడిగాడు.

"మహారాజావారు ఒప్పుకున్నారా ?" అని అడిగింది నీలవేణి

"లేదు; కాని ఆయన ఒప్పుదలతో నాకు నిమిత్తం లేదు "

"మా అమ్మకు కూడా ఇష్టంలేదు," అన్నది నీలవేణి.

"నీ ఇష్ట మేమిటో చెప్పు" అన్నాడు యువరాజు

"నా యిష్ట మంటూ ఏమున్నది ? మా అమ్మ ఎలా చెబుతే అలా చెయ్యవలసిందే నేను "

"నీలవేణీ ! నే నొక్క మాట చెబుతా, విను. నాకీ రాజ్యం అక్కర లేదు మన మిద్దరం పెళ్ళి చేసుకొని ఎక్కడన్నా పరరాజ్యానికి పోయి, అనామకులుగా సుఖజీవనం చేద్దాం, నీ కిష్టమైతే చెప్పు ఇవాళ్ళే వెళ్ళిపోదాం," అన్నాడు యువరాజు

"మా అమ్మను వదిలి నే నెక్కడికి వస్తాను ? మా అమ్మ ఇష్టం లేనిదే నే నేమీ చేయలేను" అన్నది నీలవేణి తల వంచుకుని

"ముమ్మాటికీ అంతేనా ?"—

"అంతే "

యువరాజు తలవంచుకుని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు జరిగిన విషయం విధిగా మహారాజుగారికి చేరవేయబడింది

అప్పటినుంచీ యువరాజు చాలా ముభావంగా, ఉదాసీనంగా ఉండ సాగాడు. ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోవటం మానివేశాడు. రెండు, మూడుసార్లు మహారాజావారు పిలిపించినా వెళ్ళలేదు. తప్పించుకొని తిరగసాగాడు.

మహారాజు 'ఏం చెయ్యాలా' అని ఆలోచించాడు. ముఖ్యమంత్రినికూడా పిలిపించి ఆలోచన జరిపాడు. మనస్తత్వం తెలిసినవాడు కాబట్టి ఒక పథకం వేసి ముఖ్యమంత్రితో చెప్పాడు.

'ఆ పని తమరే చేస్తే ఇంకా బాగుంటుం'దన్నాడు ముఖ్యమంత్రి.

'బాగుంది యోచన!' అన్నాడు మహారాజు.

ఒకవారం రోజుల తరువాత 'నీలవేణిగారు ఒకసారి వచ్చి పొమ్మన్నా'రని వర్తమానం వచ్చింది యువరాజుకు. యథాప్రకారం సాయంకాలం వెళ్ళాడు యువరాజు. మధురవాణి కనుపించింది. నీలవేణి ఎక్కడ అని అడిగాడు. 'ఉద్యానవనంలో ఉంది. వెళ్ళు నాయనా!' అన్నది ఆమె అదోలా నవ్వుతూ.

తాము మామూలుగా కూర్చునే పొదరింటివద్దకు వెళ్ళాడు యువరాజు. కలకల నవ్వులు వినిపించినయ్. ఒక్క క్షణం ఆగి, ముందుకు వెళ్ళి చూశాడు. నిర్ఘాంతపోయాడు. మహారాజు ఒడిలో కూర్చుని ఉన్నది నీలవేణి. తలెత్తి చూసింది. ముఖాన కత్తివ్రేటుకు నెత్తురుచుక్క లేదు.

గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు యువరాజు. నీలవేణి తత్తరపోయి నిలబడింది. నోటివెంట మాట పెగలలేదు. మహారాజావారు మందహాసం చేశారు.

ఆ వెళ్ళటం వెళ్ళటం యువరాజును మళ్ళీ ఎవరూ చూడలేదు. ఆత్మహత్య చేసుకున్నాడనీ, సన్యాసుల్లో కలిసిపోయాడనీ ప్రజలు చెప్పుకునేవారు. మహారాజావారి పుణ్యమా, అని మధురవాణి అశేషమైన ధనం ఆర్జించుకున్నది. పూర్ణిమాదేవి భ్రాతృపుత్రుణ్ణి దత్తత చేసుకున్నారు. కాని ఆయన కాలం చేయగానే రాజ్యాన్ని పరరాజులు ఆక్రమించుకున్నారు. నీలవేణి గణికగా గణుతికెక్కి దేశదేశాల్లో ఖ్యాతినీ, విశేష వైభవాన్నీ సంపాదించింది. ఆమె సౌందర్యజ్యోతి ముందు రాజులూ, సామంతులూ, వణిక్ప్రముఖులూ శలభాల్లా ఆహుతైపోయారు.

చాలా చాలా ఏండ్ల తరువాత, ఆమె ప్రాయపుప్రొద్దు తిరుగుతున్న సమయంలో ఊరి కొక సన్యాసి వచ్చాడని, ఎన్నడూ ఎవరి దర్శనానికీ వెళ్ళని నీలవేణి ఆ సన్యాసిని దర్శించి భక్తిశ్రద్ధలతో తన గృహానికి ఆహ్వానించిందని చెప్పుకుంటూ ఉంటారు. నిజమెంతవరకో తెలియదు.